క్లుప్తంగా

అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోలీసు సిబ్బంది, నిర్వాహకులు

కల్హేర్(నారాయణఖేడ్): వేసవిలో ఉపశమనం కల్పించేందుకు కల్హేర్‌లో అంబలి కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కల్హేర్‌కు చెందిన కిషన్‌రావు తన సొంత ఖర్చులతో అంబలి కేంద్రం ఏర్పాటు చేయగా పోలీసు సిబ్బంది గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఈజీఎస్ టీఏ రఘువీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

జహీరాబాద్ టౌన్: పాలీసెట్‌కు ఏప్రిల్ 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని శ్రీసంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లో డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్, డిప్లొమా ఇన్ యానిమల్ హస్బెండరీ, ఫిషరీసోలో ప్రవేశాలు పొందేవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు, టెన్త్ పాస్ అయినవారు దరఖాస్తుకు అర్హులన్నారు. ఏప్రిల్ 22 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడండి



పీపడ్‌పల్లిలో కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

రాయికోడ్(అందోల్): గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని ఎంపీడీఓ షరీఫ్ అన్నారు. మండల పరిధిలోని మోరట్గా, నల్లంపల్లి, పీపడ్‌పల్లి, మహమ్మదాపూర్, కర్చల్, ఇందూర్ గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం వరకు ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగిన ఉపాధిహామీ పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మోరట్గాలో కాలువల్లో మురుగు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలి



నీలం మధును కలిసిన నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గత ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ నేతలతో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్‌కు అధిక ఓట్లు పడేవిధంగా చూడాలని సూచించారు. కాంగ్రెస్ నేత, కౌన్సిలర్ చంద్రారెడ్డి, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లోనే ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం

జోగిపేట(అందోల్): 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామానికి చెందిన మంజుల పురిటినొప్పులతో బాధపడుతుండగా 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే జోగిపేటకు చెందిన 108 వాహనం అందుబాటులో ఉండటంతో స్పందించి వెంటనే గ్రామానికి చేరుకొని మంజులను డెలివరీ నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోకి వెళ్లగానే నొప్పులు అధికమవడంతో వాహనంలోనే వైద్య సిబ్బంది డెలివరీ చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా మంజుల కుటుంబసభ్యులకు ఈఆర్‌సీపీ డాక్టర్ హబీబ్, ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ కృష్ణమూర్తిని కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గజవాహన సేవ

నారాయణఖేడ్: పట్టణంలోని చారిత్రాత్మక సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గజవాహన సేవ, శ్రీరహరి మహారాజ్‌చే కీర్తన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గజవాహన సేవలో భాగంగా పట్టణంలో శోభయాత్ర నిర్వహించారు. కౌన్సిలర్ వివేకానంద్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు సాగర్ షెట్కార్, భక్తులు పాల్గొన్నారు.

తెరపైకి మళ్లీ తెలంగాణపురం

- పూర్వ చరిత్ర ఆధారంగా శిలాశాసనం గుర్తింపు
- తెల్లాపూర్ పేరును తెలంగాణపురంగా మార్చాలని స్థానిక ప్రజల విజ్ఞప్తి

తెల్లాపూర్‌కు ఘన చరిత్ర ఉంది. కానీ.. దాన్ని వెలుగులో తీసుకురావడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు. పూర్వం తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పిలిచేవారని చరిత్ర చెబుతోంది. అందుకు సాక్ష్యంగా శాసనం కూడా ఉంది. తెలంగాణ ఉద్యమం సమయంలో సైతం బీఆర్‌ఎస్ నేతలు ఆ శాసనాన్ని సందర్శించి తెలంగాణ వచ్చిన వెంటనే తెల్లాపూర్ పేరును తెలంగాణపురంగా మారుస్తామని హామీలు సైతం ఇచ్చారు. కానీ.. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా పేరు మాత్రం మారడంలేదని స్థానికులు వాపోతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

ఇటీవల కొద్ది రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో భాగంగా విద్యుత్‌నగర్‌కాలనీకు వచ్చిన మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తెలంగాణపురం విషయాన్ని తిరిగి తెరపైకి తీసుకొచ్చారు. దీంతో ఈ విషయం స్థానికంగా చర్చనీయంగా మారింది. శాసనం ద్వారా లభించిన ఆధారాలతో దరితెల్లాపూర్‌ను తెలంగాణపురంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సాక్ష్యాలను చూపుతున్న శాసనం

నాటి కాలం నుంచి తెల్లాపూర్‌లో రెండు రాతి స్తంభాల మధ్యన పురాతన శాసనం ఉంది. అందులో ఇలా రాసి ఉంది. శక సంవత్సరం 1340 హేవళాంబి సంవత్సరం, మాఘమాసం, గురువారం రోజున ప్రతిష్ఠించినట్లు శిలాశాసనంపై ఆధారాలు ఉన్నాయి. మన కాలమాన ప్రకారం 1417–1418గా చెప్పవచ్చును. విశ్వకర్మలలో ప్రముఖుడైన రుద్రోజు సిరిగిరోజు దీనిని రాయించినట్లు ఆ శాసనంలో ఉంది. దిగుడు బావి సమీపంలో మామిడి తోపు అని శాసనంపై రాసి ఉంది. అదే విధంగా బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా తన భార్యతో కలసి పానగల్లు కోటకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో తెలంగాణపురం (ప్రస్తుత తెల్లాపూర్)లోని మామిడి తోటలో విడిది చేసినట్లు, విశ్వకర్మ శిల్పులు బంగారు బహుమతులు అందజేసినట్లు శాసనంలో రాసి ఉంది.



శిలాశాసనంపై ఆధారాలు

పేరు మార్చండి



చరిత్ర ఆధారంగా తెల్లాపూర్‌ను పూర్వం తెలంగాణపురంగా పిలిచేవారు. అందుకు సాక్ష్యం తెల్లాపూర్‌లో ఉన్న నాటి శాసనమే. తెలంగాణ వచ్చిన వెంటనే తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మారుస్తామని నాటి నేతలు ఇచ్చిన హామీని మరిచారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెల్లాపూర్‌ను తెలంగాణపురం అని పేరు మార్చి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

– కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్

తీర్మానం చేశాం



రాష్ట్రం ఏర్పడిన తర్వాత సర్పంచ్‌గా గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశంలో తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మార్చాలని తీర్మానం చేశాం. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ అంశం ప్రస్తావన రావడంతో అప్పటి నాయకులు శాసనను సందర్శించారు. కానీ.. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణపురంగా పేరు మార్చాలని ప్రభుత్వానికి నివేదిక కూడా పంపించాం.

– సోమిరెడ్డి, మాజీ సర్పంచ్

నీటి సంరక్షణపై అవగాహన

కంది(సంగారెడ్డి): ఇంకుడు గుంతలతో భూగర్భజలాలు పెరుగుతాయని హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు అన్నారు. కంది మండల పరిధిలోని మక్తఅల్లూర్‌లో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా 3 రోజులుగా గ్రామ ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సంరక్షణతో భూగర్భజలాలను కాపాడుకోవచ్చన్నారు. నీటి వృథా కాకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కూలీలకు పనులు కల్పించండి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు తప్పనిసరిగా 100 రోజుల పని కల్పించేందుకు బాధ్యతగా పని చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని రాసోల్ గ్రామంలో గురువారం నిర్వహించిన కాలకీర్తనతో శ్రీరామాలయం ప్రాణప్రతిష్ఠలో భాగంగా నిర్వహించిన అఖండ హరినామ సప్తాహం ముగిసింది. నిత్యం భజనలు, గాథాపఠనం, కాకడ హారతి, కీర్తనలతో వారం రోజులుగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సింధురెడ్డి

చలివేంద్రం ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో సింధు ఆదర్శ్ మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వేసవిలో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాణియదవ్, నాగమణి, నస్రీన్, సునిత, అరుణజ్యోతి, సత్యనారాయణ, సంపత్‌గౌడ్, పాషా, రాధాకృష్ణ పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి అవుసుల ప్రవీణ్‌కుమార్ ప్యాక్స్ సిబ్బంది అడివప్ప మార్క్‌ఫెడ్ సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో కొనుగోలులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాణ్యతతో కూడిన జొన్నలు కొనుగోలు కేంద్రానికి పంపాలని ఏఓ సూచించారు. ఏఈఓలు ఇచ్చే టోకెన్లు తీసుకొని రైతులు కొనుగోలు కేంద్రానికి రావాలన్నారు. ఎకరాకు 8.5 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. క్వింటాలుకు రూ.3,180లు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

వైభవంగా సీతారాముల కల్యాణం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీరామ కళామందిరంలో గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ పట్టు వస్త్రాలతో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు, పట్టణ ప్రజలతో కలిసి మందిరం వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం సీతారామ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. కల్యాణం అనంతరం టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సీతారాముల విగ్రహాలపై తలంబ్రాలు వేసి దర్శించుకున్నారు.

జహీరాబాద్ పట్టణంలో...

జహీరాబాద్: పట్టణంలోని రామాలయంలో గురువారం సీతారామ కల్యాణం వైభవోపేతంగా జరిగింది. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో సంగారెడ్డి ఎమ్మెల్యే కుమారుడు చింతా సాయినాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు నరేష్ గౌడ్, నాగేష్, వెంకటేశం, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సదాశివపేట: ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మండల పరిధిలోని నందికంది గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో గురువారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు టీజీఐఐసీ చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకురాలు జయరెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే కుమారుడు చింతా సాయినాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సిద్దన్న, గ్రామపెద్దలు, భజన భక్తులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

‘ఎంపీగా గెలిపిస్తే రుణం తీర్చుకుంటా’

కల్హేర్(నారాయణఖేడ్): జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటానని ప్రతి బిల్లుపై మాట్లడుతానని కల్హేర్ మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన ఎస్‌ఆర్ఐ గుర్రపు మశ్చేందర్ అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని నాగధర్, మునిగేపల్లి, తదితర చోట్ల గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మశ్చేందర్ ఓటును అభ్యర్థిస్తూ చెప్పులు అమ్మి వినుత్నంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కల్హేర్ ఎంపీపీ గుర్రపు సుశీల, నాయకులు నాగిరెడ్డి, శ్రీనివాస్, వీరప్ప పాల్గొన్నారు.



చెప్పులు కుట్టుతూ ఓటు అభ్యర్థిస్తున్న ఎస్‌ఆర్ఐ మశ్చేందర్

ప్రమాదాలకు అడ్డా.. పస్తాపూర్ చౌరస్తా

- గుంతలు తవ్వి వదిలేయడంతో పొంచి ఉన్న ముప్పు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



గుంతలో పడిన బులెరో వాహనం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తాలో బులెరో వాహనం బుధవారం రాత్రి అదుపుతప్పి మురికి కాలువలో పడింది. కొన్ని నెలల క్రితం కారు గుంతలో బోల్తా పడింది. ఇలా తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా ప్రమాదాల నివారణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసువడంలేదని విమర్శలు వస్తునాయి. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పస్తాపూర్ చౌరస్తా వద్ద మురుగు కాలువల పనుల కోసం తవ్విన గుంతను పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఏడాది గడుస్తున్నా గుంతను పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఏడాది గడుస్తున్నా పూర్తికాని మురుగుకాలువ పనులు

పస్తాపూర్ చౌరస్తా సర్కిల్ నుంచి ఓవైపు ఝరాసంగం మరోవైపు హైదరాబాద్‌కు వెళ్లేందుకు దారులు ఉన్నాయి. బస్సుల కోసం ప్రయాణికులు అక్కడే ఎదురుచూస్తుంటారు. ఝరాసంగం వైపునకు వెళ్లే ఆటోలు కూడా ఇక్కడే ఆగుతుంటాయి. జహీరాబాద్ నుంచి స్పీడ్‌గా వచ్చే వాహనాలు అదుపుతప్పి గుంతలో పడిపోతున్నాయి. ఇటీవల ఓవాహనం అదుపుతప్పి గుంతలో పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తమవుతోంది. మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువల పనులు పూర్తి చేసి పస్తాపూర్ చౌరస్తాలో ప్రమాదాలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మురుగు గుంత

నియామకం

నారాయణఖేడ్: అంబేడ్కర్, పూలే సేవాసమితి సంగారెడ్డి జిల్లాశాఖ అధ్యక్షుడిగా మనూరు మండలం బోరంచకు చెందిన బైండ్ల కృష్ణ నియమితులయ్యారు. గురువారం ఖేడ్‌లోని సంఘం కార్యనిర్వాహక కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శి పండరి ఈ మేరకు నియామక ఉత్తర్వును అందజేశారు. ఈ సందర్భంగా బైండ్ల కృష్ణ మాట్లాడుతూ తనకు సంఘంలో మూడేళ్లుగా మండల స్థాయిలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. బాలల హక్కులు, మానవ, మహిళల హక్కుల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

నామినేషన్ పత్రాలకు పూజలు



నామినేషన్ పత్రాలకు పూజలు చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ దాఖలు చేయనున్న నామినేషన్ పత్రాలకు గురువారం షెట్కార్ కుమారుడైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లా నాయకులు సాగర్ షెట్కార్ ఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో స్వామివారి ఎదుట ఉంచి వేదపండితులచే పూజలు చేయించారు. ఈ సందర్భంగా నాయకులకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కాశీనాథ్‌పటేల్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వివేకానంద్, నాయకులు సురేష్, శివ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మట్టి డంపింగ్



తెల్లాపూర్‌లోని రేడియల్ రోడ్డుపై పోసిన మట్టి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిర్మాణాల కోసం తవ్వగా వచ్చిన మట్టిని, రాళ్లను భవన నిర్మాణదారులు మట్టిని టిప్పర్లతో తరలిస్తూ రోడ్లపై డంపింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాదారుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలిసినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

బీజేపీ శ్రేణుల ఇంటింటి ప్రచారం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు అప్పం శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం శాంతినగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్‌స్వామి, ప్రధాన కార్యదర్శి సంతోష్, నాయకులు అర్చన సరడా, శోభరాణి, రాజు రిషబ్, రాజ్‌కుమార్ శ్రీనివాస్, వీరన్న పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని రాచన్నపేటలో బీజేపీ నాయకులు ఆశోక్ బెల్కేరీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మునిపల్లిలో...

మునిపల్లి(అందోల్): జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉపెందర్ ఆధ్వర్యంలో మండలంలోని తాటిపల్లి, మస్‌సాన్‌పల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాటిపల్లి రాజిరెడ్డి, నవీన్, హరికృష్ణ, రాజు, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీశైలం, శ్రీశైలం, శివారెడ్డి, నాగరాజు, నరోత్తంచారి శేఖర్, వీరన్నపటేల్, శశికుమార్ పాల్గొన్నారు.



శాంతినగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ

హత్నూర(సంగారెడ్డి): వచ్చే నెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఫర్వీన్‌షేక్ అన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఫర్వీన్‌షేక్